

పచ్చదనం.. పరిశుభ్రత

రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు

కాగజ్‌నగర్ టౌన్: కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో పచ్చదనం కనువిందు చేస్తోంది. విద్యాలయానికి వెళ్లే దారికి ఇరువైపులా పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చదనం పరిశుభ్రతతో నాణ్యమైన విద్యాబోధన విద్యార్థులకు అందిస్తున్నారు.

సర్వీసు రోడ్లు..చిమ్మ చీకట్లు



గంగాపూర్ కమాన్ నుంచి జర్నలిస్టు కాలనీ వైపు సర్వీస్ రోడ్డు ఇలా..

రెబ్బెన: మంచిర్యాల టు చంద్రపూర్ వరకు నిర్మించిన జాతీయ రహదారి పనులు పక్క జిల్లాతో పోల్చితే కుమురం భీం జిల్లాలో ఏమాత్రం పొంతన లేకుండా పోయాయి. పనుల నాణ్యత విషయంలో ఎంతో తేడా ఉండగా చివరికి పనుల డిజైన్‌లో ఏమాత్రం పొంతన కనిపించడం లేదు. మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారికి అనుకొని ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్డు చివరివరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. అదే రోడ్డు కుమురం భీం జిల్లాకు వచ్చేసరికి మాత్రం డిజైన్‌లో మార్పులంటూ సర్వీస్ రోడ్ల వెంట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో సర్వీసు రోడ్ల వెంట చిమ్మచీకట్లోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రాత్రివేళలో రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ



మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసిన ప్రైవేట్ వాహనాలు

కాగజ్‌నగర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో మార్కెట్‌యార్డు స్థలంలోని చెట్ల కింద ప్రైవేట్ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ యార్డులో సివిల్ సప్లై గోదాంతో పాటు సహకార పరపతి కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వాహనాల పార్కింగ్ వల్ల కార్యాలయాలకు వచ్చి పోయే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– కాగజ్‌నగర్ టౌన్

క్లుప్తంగా

హిందీ భవన్ కోసం స్థలం కేటాయించాలి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో హిందీ భవన్ కోసం స్థలం కేటాయించాలని ఎంపీ గోడం నగేశ్‌కు హిందీ భాషా సేవా సమితి సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ భాష అభ్యున్నతి కోసం హిందీ భవన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా హిందీ దినోత్సవాలు, కవి సమ్మేళనాలు, కార్యక్రమాల నిర్వహణకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే నిరుద్యోగులకు సైతం ఇది ఉపయోగపడుతుందన్నారు. భవనంతో పాటు ప్రత్యేక లైబ్రరీని స్థాపించాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్, దత్తాత్రేయ, మహేశ్, సాంబన్న, చంద్రశేఖర్, ఉద్ధవ్ పాల్గొన్నారు.

మాగంటి గోపినాథ్ మృతి తీరని లోటు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరని లోటని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన అకాల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అంకం అశోక్

భీంపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల అధ్యక్షుడు అంకం అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మారుగూడ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుర్ల నారాయణ, నాయకులు స్వామి, సోమేశ్వర్, గంగన్న, చిన్ను, సురేశ్, రాంప్రసాద్, సంజీవ్, పండరి, అనిల్ పాల్గొన్నారు.

దళిత సంఘాల సంబరాలు

ఇంద్రవెల్లి: చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దక్కడంతో ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో దళిత సంఘాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తూ మాల (మహార్) కులానికి చెందిన గడ్డ వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, దళిత సంఘాల నాయకులు కామ్‌రాజ్ వాగ్మారే, మస్కే రాజువర్ధన్, సత్యానంత్, శివాజీ, సూర్యవంశీ పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం చర్లపల్లి గ్రామంలో గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన కొట్రంగి విజయ్(పోచన్న) తన పెరట్లో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడని సమాచారంతో ఆదివారం తనిఖీ చేయగా 8 గంజాయి మొక్కలు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని విజయ్‌ను అరెస్ట్ చేసి బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

బలవుతున్న మూగజీవాలు

- మాయదారి రోగం.. ప్రాణాలు తీస్తుంది
- పదిరోజుల్లో 15 పశువులు మృతి
- వరుస మరణాలతో బెంబేలెత్తుతున్న రైతులు



ఈ చిత్రంలో ఉన్నది రైతు టి.అయ్యు. ఈయన స్వగ్రామం కొలాంగూడ. ఈయనకు ఐదెకరాల పొలం ఉంది. రెండు ఎడ్లు ఉన్నాయి. ఈ నెల 4న రూ.45 వేల ఖరీదు చేసే ఎద్దు ఇటీవల ఒకటి చనిపోయింది. ప్రస్తుతం ఒకటే మిగిలింది. ఇక వ్యవసాయం ఎలా చేయాలని ఆందోళన చెందుతున్నాడు. ఒక్క అయ్యు సమస్యే కాదు ఆ గ్రామంలో ఉన్న అనేకమంది రైతులు పశుసంపదను కోల్పోయి మదనపడుతున్నారు. ముంచుకొచ్చిన ఖరీఫ్ కాలంలో ఏం చేయాలి. ఎలా చేయాలి. ఒక్క ఎద్దుతో సాగు ఎలా చేయాలని పేర్కొంటున్నారు.



మహరాజ్‌గూడలో మృతి చెందిన లేగదూడ



శివగూడలో...

కెరమెరి: గుర్తుతెలియని వ్యాధితో వరుసగా మూగజీవాలు మృత్యువాత పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న రైతులు వరుసగా ఎడ్లు, ఆవులు, లేకదూడలు మాయదారి రోగం బారిన పడి ప్రాణాలు తీస్తోంది. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని జాబేఝరి పంచాయతీలోని కొలాంగూడ, బాబేఝరి, మహరాజ్‌గూడ, గోండ్‌గూడలో 10 రోజుల్లో ఇప్పటికి 15 పశువులు మృతిచెందాయని రైతులు చెబుతున్నారు.

కట్టేసిన చోటే మృత్యువాత..

ఉదయం అడవుల్లో మేత మేసి ఇంటికి పశువులు వస్తున్నాయి. రైతులు వాటికి నీళ్లు తాగించి కొట్టంలో కడుతున్నారు. తెల్లవారగా చూడగానే కట్టిన చోటే మృతిచెంది ఉంటున్నాయని పేర్కొంటున్నారు. అసలు ఏం రోగం అవహిస్తుందో తెలియడం లేదని వాపోతున్నారు. చాలాసార్లు పశువైద్యాధికారులకు సమాచారం అందిస్తున్నప్పటికి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఫోన్ చేసినప్పుడే స్పందిస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆవులు పశువుల్లో, దూడల్లో జబ్బువాపు చర్మవాపు, గొంతు వాపు వ్యాధులు సోకుతున్నాయని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు.

15 పశువులు

గతనెల 28 నుంచి ఆదివారం వరకు 12 మంది రాథోడ్ సుభాశ్, లచ్చయ్య, రాథోడ్ గోపాల్, టేకం గుండయ్య, అయ్యు, మాన్కు, రాజు, సిడాం మాని, ఆత్రం భీంరావు, మెస్రం హన్మంతు, ఉయికా లింగు, టేకం ఇస్రు రైతులకు చెందిన 15 పశువులు(ఆవులు, ఎడ్లు, లేగదూడ)లు మృతిచెందాయి. వారిలో టేకం మాన్కుకు చెందిన మూడు, ఆత్రం భీంరావుకు చెందిన రెండు పశువులు మృతి చెందగా, మిగిలిన వారి ఒక్కొక్కటి మృతిచెందింది.

పట్టించుకోలేదు



గత పది రోజులుగా బాబేఝరి పంచాయతీలో మూగజీవాలు మృతిచెందినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయలేదు. గ్రామాల్లో చాలా పశువులు ఉన్నాయి. ఆదివారం లేగదూడ చనిపోయింది. మరొకటి పరిస్థితి విషమంగా ఉంది.

– రాథోడ్ సుభాష్, మహారాజ్‌గూడ

మూడు రకాల వ్యాధులు



మూగజీవాల్లో జబ్బ, చర్మ, గొంతువాపు వ్యాధులు సోకుతున్నాయి. అక్కడ కూడా ఆ వ్యాధులే సోకి ఉండవచ్చు. విద్యుత్, పాముకాటుతో ఎడ్లు మరణించిన సమాచారం ఉంది. ఆకస్మిక మరణాల గురించి సమాచారం ఉదయమే వచ్చింది. సిబ్బందిని ఆ గ్రామాలకు పంపించి చికిత్స చేయిస్తున్నాం.

– కె.సురేశ్, పశువైద్యాధికారి, కెరమెరి

కాగా, సుమారు రూ.6 లక్షలకు చెందిన పశువుల మృతిచెందాయని రైతులు పేర్కొంటున్నారు.

విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలని ఎంఈవో సుభాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలో కల్పించే వసతులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సెలవురోజూ బడిబాట..

కెరమెరి: ఆదివారం సెలవు రోజూ.. అయినా బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు కొనసాగించారు. మండలంలోని కెరమెరి, గోయగాం మోడి, అనార్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న అనేక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడికి రాని, బడికి వెళ్లని, బడిమాధ్యలో ఆపివేసిన, బడీడు పిల్లలను గుర్తించేందుకు టీచర్లు వారి ఇళ్లకు వెళ్లి బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. ర్యాలీలు నిర్వహించారు. బడీడు పిల్లలు బడిలో ఉండాలి, పనిలో కాదని అవగాహన కల్పించారు. కార్యక్రమం 19 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.



కెరమెరి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బీజేపీ పాలనలో దేశ ప్రగతి

రెబ్బెన: బీజేపీ పాలనతో దేశ ప్రగతి ఎంతో పెరిగిందని ప్రపంచం లోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ పథకాల అమలు, ఆపరేషన్ సిందూర్‌తో సాధించిన విజయం వంటి అనేక అంశాలపై చర్చించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం లోని కోదండ రామాలయంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో అవినీతి, కుంభకోణాలు లేని సుస్థిర పాలన దేశంలో కొనసాగుతుందన్నారు. కేంద్ర పథకాలను ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు మంజుల వెంకన్న, దుర్గం శ్రీధర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

మండల కార్యవర్గంలో పలువురికి చోటు..

పార్టీ మండల కార్యవర్గంలో పలువురికి చోటు కల్పించారు. ప్రధాన కార్యదర్శులుగా పసుపులేటి మల్లేశ్, రామగిరి సతీశ్, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌చారి, చికనం పద్మ, కార్యదర్శులుగా రాచకొండ భాగ్యలక్ష్మి, సచిన్ జైస్వాల్ ను ఎంపిక చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ప్రకటించారు.

చేపలకు డిమాండ్..



చేపలు కొనేందుకు బారులు తీరిన ప్రజలు

కౌటాల: మండల ప్రజలు ఆదివారం మృగశిర కార్తెను ఘనంగా నిర్వహించారు. చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు దీరారు. దీంతో మండల కేంద్రంతో పాటు మండలంలోని కన్నెపల్లి, గురుడుపేట, గుడ్లబోరి, పార్డీ గ్రామాల్లోని చెరువుల వద్ద జన సందడి నెలకొంది.

దహెగాం: మృగశిరకార్తె ఆదివారం ప్రవేశించడంతో తప్పనిసరిగా చేపలు తినాలని ఆనవాయితీ ఉండడంతో మండల ప్రజలు చెరువులు, ప్రాజెక్టుల వద్ద బారులు తీరారు. మండల కేంద్రంలో ఉదయం 8 గంటలకే చేపలు అమ్మడానికి రావడంతో ప్రజలు కొనుగోలు చేశారు. గెర్రె చెరువు వద్ద, పీపీరావు ప్రాజెక్టు వద్ద పరుగులు తీశారు. చేపలు కిలో 200 నుంచి 300 వరకు విక్రయించారు.



చెరువు వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలి

ఖానాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

శిథిలావస్థలో సర్కారు బడులు

- భయాందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అల్లిగూడలో ఆరుబయట కూర్చున్న విద్యార్థులు (ఫైల్)



శిథిలావస్థకు చేరిన రఘునాథ్‌పూర్ పాఠశాల

నార్నూర్: సర్కారు బడిలో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, పాలకులు ఆచరణలో మాత్రం ఎక్కడ కూడా సౌకర్యాలు కనిపించడం లేదు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి దాదాపు 77 ఏళ్లు అవుతున్నా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. గాదిగూడ మండలంలోని అల్లిగూడ, కునికాసా చిత్రుగూడ, శివనారా, ధర్మగూడ గ్రామాల్లో పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒకొక్క పాఠశాలలో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్న సరైనా సౌకర్యాలు లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలకు సొంత భవనాలతో పాటు శిథిలావస్థలో ఉన్న పాఠశాలలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇచ్చోడ: బోథ్ మండలంలోని రఘునాథ్‌పూర్ గిరిజన పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మారుమూల గిరిజన గ్రామమైన రఘునాథ్‌పూర్‌లో ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భీమన్న విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామంలో భక్తిశ్రద్ధలతో ముదిరాజ్‌లు భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. చెరువు సమీపంలోని పంట పొలాల్లో నూతనంగా నిర్మించిన ఆలయంలో భీమన్న విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు నవగ్రహ పూజతో పాటు ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా వర్షాలు పడి పాడి పంటలు పండాలని, ఎలాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ఆయురారోగ్యాలతో ఉండాలని భీమన్న దేవుడిని పూజించడం జరుగుతుందని ముదిరాజ్ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ నారాయణ, సలేంద్ర శివయ్య పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

తాంసిలో గాలివాన బీభత్సం

తాంసి: మండలంలో ఆదివారం సాయంత్రం మండలంలోని కప్పర్ల, తాంసి, వడ్డాడి, జామిడి, గిరిగాం, హస్నాపూర్, పొన్నారి, సావర్గాం గ్రామాల్లో వర్షం పడింది. గాలివానకు వడ్డాడి నుంచి పొచ్చెర వరకు ఉన్న రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే జామిడి గ్రామ శివారులో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.



విరిగిపడిన విద్యుత్ స్తంభాలు